మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ   పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర   సంపుటి : 08   సంచిక : 236   శనివారం   07 - 03 - 2026   పేజీలు: 8   వెల: 4

## గ్రామ సర్వేయర్ల ఆందోళన



3లో..

### జగన్ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు

# వెనక్కి వెళ్లింది

- బడ్జెట్‌పై అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగం
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన బడ్జెట్ అని ప్రశంస

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రం దాదాపు 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రూ. 3.32 లక్షల కోట్ల బడ్జెట్ ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని కొనియాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ సామాజిక భద్రతా పెన్షన్ల కోసం రూ. 33 వేల కోట్లు కేటాయించడం ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న సాహసోపేత నిర్ణయమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్ రూపొందించారని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనాలోచిత విద్యుత్ కొనుగోళ్ల కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ. 12,250 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన విమర్శించారు. విద్యుత్ సంస్థలు మొత్తం రూ. 1.29 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూడౌన్ పేరుతో విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించామని చెప్పారు. గత ప్రభుత్వం రూ. 9 లక్షల కోట్ల అప్పులతో పాటు రూ. 35 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని, అందులో ఇప్పటికే రూ. 25 వేల కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. అదేవిధంగా గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో రూ. 8,700 కోట్ల కేంద్ర నిధులు వినియోగం కాలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు కేటాయించి ఇంటింటికీ మంచినీరు అందించే



ప్రాజెక్టును వేగవంతం చేస్తోందని తెలిపారు. "నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదు, భావితరాల కోసం" అనే రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తిని ఉటంకిస్తూ, భావితరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకున్నారని పవన్ కళ్యాణ్ అన్నారు.



### అమెరికా 'డూమ్స్‌డే'

# క్షిపణి పరీక్ష

- మినిట్‌మ్యాన్3 విజయవంతంగా ప్రయోగం
- హిరోషిమా బాంబు కంటే 20 రెట్లు శక్తివంతం

మన గళం, న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో అమెరికా కీలక క్షిపణి పరీక్షను నిర్వహించింది. అత్యంత శక్తివంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్‌మ్యాన్3ను కాలిఫోర్నియా తీర ప్రాంతంలో అమెరికా పరీక్షించింది. 'డూమ్స్‌డే' క్షిపణిగా పిలిచే ఈ మిసైల్ నిర్దేశించిన లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. మినిట్‌మ్యాన్3 క్షిపణిలో అత్యంత

2 లో..

### దాడిలో ప్రత్యక్షంగా పాల్గొనలేదని

# ఆస్ట్రేలియా స్పష్టం



- ఇరాన్ నౌకపై దాడి సమయంలో అమెరికా జలాంతర్గామిలో ఆస్ట్రేలియా సిబ్బంది
- శిక్షణలో భాగంగా ముగ్గురు ఉన్నట్లు వెల్లడి

మన గళం డెస్క్ : హిందూ మహాసముద్రంలో అమెరికా జలాంతర్గామి ఇరాన్ నౌకపై టార్పిడోతో దాడి చేసిన ఘటనలో 87 మంది నావికులు మృతిచెందగా, సుమారు 50 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ వెల్లడించారు. ఆ దాడి జరిగిన సమయంలో అమెరికా జలాంతర్గామిలో ముగ్గురు ఆస్ట్రేలియా రక్షణ దళ సభ్యులు కూడా ఉన్నట్లు తెలిపారు. అయితే ఆస్ట్రేలియా సిబ్బంది ఈ దాడిలో ప్రత్యక్షంగా

2 లో..



### కూటమి ప్రభుత్వం మంచినీరు ఇవ్వలేకపోతోంది

- కవతవరం గ్రామంలో రచ్చబండలో ప్రజల ఆవేదన
- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారం కోరిన షర్మిల

మన గళం, గుడివాడ : గ్రామాల్లో ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు కూడా అందించలేని కూటమి ప్రభుత్వం సుపరిపాలన పేరుతో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. చంద్రబాబు చెబుతున్న వికాసం పేరుకే పరిమితమైందని, సంక్షేమం బూటకమైందని, అభివృద్ధి డొల్లగా మారిందని ఆమె ఆరోపించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ

2 లో..



### ఘనంగా ఎద్దుల కాటన్

# షో రూమ్ ప్రారంభోత్సవం

మన గళం, కర్నూలు : నగరంలోని స్థానిక పాతబస్తీలోని బొంగుల బజార్ లో ఎద్దుల కాటన్ షో రూమ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నాయకులు చంద్రమౌళి బీజేవైయం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూ రు రాఘవేంద్ర హాజరయ్యారు వారిని ఎద్దుల కాటన్ అధినేత ఎద్దుల మహేశ్వర్ రెడ్డి తదితరులు శాలువాలు కప్పి సత్కరించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ వారి షోరూం అభివృద్ధి పథాన ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

### సుఖోయ్30 యుద్ధవిమానం కూలి

# ఇద్దరు పైలట్లు మృతి



మన గళం, న్యూఢిల్లీ : భారత వాయుసేనకు చెందిన సుఖోయ్30 ఎంకేఐ యుద్ధవిమానం అసోం రాష్ట్రంలో కూలిపోయింది. కార్బి ఆంగ్‌లోంగ్ జిల్లా సమీపంలో గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు వాయుసేన అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఈ యుద్ధవిమానం అసోంలోని జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి ఎగిరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రాడార్‌తో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

2 లో..

# వోకల్ ఫర్ లోకల్‌కు మద్దతు



- అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వక భేటీ
- స్వదేశీ మెడికల్ కిట్‌ను సీఎంకు అందజేత

మన గళం, అమరావతి : అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మరియు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్

2 లో..

### నిజాయితీలో ప్రభుత్వ పాఠశాల

# విద్యార్థినులు బంగారం: లోకేష్

- దొరికిన పర్సును పోలీసులకు అప్పగించిన విద్యార్థినులు
- బంగారం, నగదును యజమానికి తిరిగి అందజేత
- విద్యార్థినుల నిజాయితీపై మంత్రి అభినందనలు





మన గళం, తిరుపతి : ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని మంత్రి నారా లోకేష్ అభినందించారు. తిరుపతి జిల్లా వెంకటగిరి జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థినులు దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. గురువారం సాయంత్రం

2 లో..

## అమెరికా 'డూమ్స్‌డే' క్షిపణి పరీక్ష



శక్తివంతమైన మార్క్21 రీఎంట్రీ వాహనం అమర్చబడి ఉంటుంది. దీనిలో అణు పేలోడ్‌ను అమర్చే సామర్థ్యం ఉంది. ఈ క్షిపణి 1945లో జపాన్‌లోని హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కంటే దాదాపు 20 రెట్లు ఎక్కువ శక్తివంతమైన అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదని సమాచారం. ఈ ఖండాంతర క్షిపణి గంటకు సుమారు 15 వేల మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. దాదాపు 6 వేల మైళ్ల దూరం వరకు లక్ష్యాన్ని చేరుకునే సామర్థ్యం దీనికి ఉంది. అంటే ప్రయోగించిన తర్వాత కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించగలదు. గత ఏడాది నవంబర్‌లో కూడా ఈ క్షిపణిని అమెరికా పరీక్షించింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో మరోసారి ఈ పరీక్ష నిర్వహించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. అమెరికా రక్షణ సామర్థ్యాన్ని బలపరచడమే ఈ పరీక్షల ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## దాడిలో ప్రత్యక్షంగా పాల్గొనలేదని ఆస్ట్రేలియా స్పష్టం



పాల్గొనలేదని ప్రధాని స్పష్టం చేశారు. వారు కేవలం శిక్షణ కార్యక్రమంలో భాగంగా మాత్రమే అక్కడ ఉన్నారని పేర్కొన్నారు. శ్రీలంక దక్షిణ తీర ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో అమెరికా జలాంతర్గామి టార్పిడో ప్రయోగించి ఇరాన్ నౌకను పేల్చివేసినట్లు సమాచారం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత టార్పిడోతో శత్రు దేశ నౌకను అమెరికా పేల్చివేయడం ఇదే మొదటిసారి అని చెబుతున్నారు. ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్ మధ్య కుదిరిన రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఆస్ట్రేలియా రక్షణ దళ సిబ్బందికి శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గాములను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మూడు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా సిబ్బంది అమెరికా జలాంతర్గామిలో శిక్షణ పొందుతున్నట్లు వెల్లడించారు. అమెరికా మిత్రదేశమైన ఆస్ట్రేలియా ప్రస్తుతం ఇరాన్‌పై జరుగుతున్న సైనిక చర్యల్లో తమ ప్రత్యక్ష పాత్ర లేదని పేర్కొంది. అయితే ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధిని వ్యతిరేకించే విషయంలో తమ దేశం కట్టుబడి ఉందని ఆస్ట్రేలియా ప్రభుత్వం వెల్లడించింది.

## సుఖోయ్30 యుద్ధవిమానం కూలి ఇద్దరు పైలట్లు మృతి

అనంతరం విమానం మారుమూల కొండ ప్రాంతంలో కూలిపోయినట్లు సమాచారం అందింది. స్థానికులు భారీ పేలుడు శబ్దం వినిపించడంతో పాటు మంటలు చెలరేగినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించారు. జోర్హాట్ నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో విమానం కూలిపోయిన ప్రాంతాన్ని గుర్తించారు. ప్రమాదంలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధృవీకరించారు. మృతులుగా స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ మరియు ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దుర్గాకర్‌గా గుర్తించారు. వారి మృతిపట్ల భారత వాయుసేన తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. కేంద్ర రక్షణ మంత్రి కూడా సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## నెయ్యి అంశాన్ని ప్రభుత్వం వక్రీకరిస్తోంది: వైవీ సుబ్బారెడ్డి



మన గళం, తిరుపతి : తిరుమలలో నెయ్యి కల్తీ అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఈ అంశాన్ని కూటమి ప్రభుత్వం వక్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. శ్రీవారి సన్నిధిలో ఏదైనా పొరపాటు జరిగితే దేవుడే చూసుకుంటాడని ఆయన వ్యాఖ్యానించారు. టీటీడీ చైర్మన్‌పై నిందలు వస్తున్న నేపథ్యంలో తప్పు ఉంటే ఒప్పుకోవడం మంచిదని అన్నారు. అలాగే వెంకటేశ్వరస్వామిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు సంపూర్ణ నమ్మకం ఉందని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నెయ్యి విషయంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వ కాలంలోనే తప్పు జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం నిజాలను వెల్లడించాలని వైవీ సుబ్బారెడ్డి కోరారు.

## కూటమి ప్రభుత్వం మంచినీరు ఇవ్వలేకపోతోంది



పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా గుడివాడ నియోజకవర్గంలోని కవతవరం గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కొత్తగా పెన్షన్లు నమోదు చేయలేదని, ఉన్న పెన్షన్లను కూడా తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమ గ్రామానికి అందడం లేదని గ్రామస్థులు చెప్పారు. ప్రజల సమస్యలను విన్న షర్మిల గ్రామస్థుల సమక్షంలోనే కృష్ణా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## వోకల్ ఫర్ లోకల్‌కు మద్దతు

మాధవ్ కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎంతో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాల స్ఫూర్తితో రాష్ట్రంలో తయారైన ఆయుర్వేద ఔషధాలు మరియు సహజసిద్ధమైన సిరిధాన్యాలతో రూపొందించిన స్వదేశీ మెడికల్ కిట్‌ను ముఖ్యమంత్రికి అందజేశారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేయవచ్చని నాయకులు తెలిపారు. స్వదేశీ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్‌తో పాటు పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు.

## నిజాయితీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు బంగారం: లోకేష్

పాఠశాల అనంతరం మన్నవరం బస్సు కోసం వెంకటగిరి ఎస్బీఐ బ్యాంకు వద్ద ఎదురుచూస్తున్న కొత్తపల్లి గుంటకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు గురుప్రియ, గీతిక, గీతికతో పాటు 7వ తరగతి విద్యార్థిని హేమలత, 6వ తరగతి విద్యార్థిని పద్మశ్రీలకు ఒక పర్సు కనిపించింది. పర్సు తీసి చూడగా అందులో బంగారు నగలు, నగదు ఉండటాన్ని గమనించారు. వెంటనే ఎలాంటి సందేహం లేకుండా విద్యార్థినులు సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ స్వరూపకు ఆ పర్సును అప్పగించారు. అనంతరం పర్సు కోసం వెతుకుతూ వచ్చిన మహిళకు పోలీసులు ఆ నగలు, నగదును ధృవీకరించి అందజేశారు. చిన్న వయస్సులోనే విద్యార్థినులు చూపిన నిజాయితీ ఆదర్శంగా నిలిచిందని మంత్రి నారా లోకేష్ ప్రశంసించారు. వారి ప్రవర్తన విద్యాశాఖ గౌరవాన్ని మరింత పెంచిందని పేర్కొంటూ విద్యార్థినులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## డిసెంబర్ నాటికి రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తి లక్ష్యం

**- పోర్టు పనులు 75 శాతం పూర్తి - స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి - పునరావాసం, మౌలిక సదుపాయాల అభివృద్ధి చర్యలు**



మన గళం, రామాయపట్నం : ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు ప్రస్తుతం 75 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పోర్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పోర్టు నిర్మాణంతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పోర్టు సంబంధిత ఉద్యోగాల కోసం స్థానిక యువతకు శిక్షణ అందించేందుకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పోర్టులో కలిగే ఉద్యోగాల్లో 75 శాతం అవకాశాలు స్థానికులకు ఇవ్వాలని నిర్ణయించారు. పోర్టు నిర్మాణంతో స్థలచలనం చెందిన కుటుంబాల పునరావాసం కోసం గూడ్లూరు మండలం కార్లపాలెం గ్రామంలో పునరావాస కాలనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా 371 నిర్వాసిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మరోవైపు సుమారు 80 కోట్ల రూపాయల వ్యయంతో 70 ఎకరాల్లో 680 మందికి కాలనీలు అభివృద్ధి చేస్తున్నారు. పోర్టు ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కూడా చర్యలు కొనసాగుతున్నాయి. వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం వరకు డబుల్ రోడ్ నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు. మన్నేరు నదిపై మాచవరం, కలవల్ల ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి నిధులు కోరారు. కార్లపాలెం సమీపంలో మత్స్యకారుల కోసం రూ.20 కోట్ల వ్యయంతో జెట్టి విస్తరణకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

## నెల్లూరులో జోరుగా జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

– మండుటెండలను లెక్కచేయకుండా మహిళల ప్రచారం – పవన్ కళ్యాణ్ పిలుపుతో సభ్యత్వ నమోదు వేగం



మన గళం, నెల్లూరు : జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నెల్లూరు పట్టణంలో జోరుగా కొనసాగుతోంది. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు వీరమహిళలు మండుటెండలను సైతం లెక్కచేయకుండా సభ్యత్వ ప్రచారం నిర్వహిస్తూ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మహిళా కార్యకర్తలు అలుపెరగకుండా పనిచేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రజల్లో పార్టీ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఉద్యమి సభ్యత్వాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్టీ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు మద్దతు అందిస్తున్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న మహిళా సాధక్‌లకు నాయకులు అభినందనలు తెలిపారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా పార్టీ బలోపేతానికి మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

## రైల్వే కోడూరు కోర్టుకు హర్షవీణ హాజరు

మన గళం, రైల్వే కోడూరు : జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కుటుంబానికి సంబంధించిన కేసులో బాధితురాలిగా పేర్కొనబడిన హర్షవీణ రైల్వే కోడూరు కోర్టుకు హాజరయ్యారు. హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ షరతుల మేరకు సంబంధిత పూచీకత్తులను సమర్పించేందుకు ఆమె స్థానిక కోర్టుకు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి ప్రమీలమ్మ తన కుమారుడిని హర్షవీణ వేధిస్తున్నారని ఆరోపిస్తూ రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఈ కేసులో హర్షవీణకు సంబంధించి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసులో హర్షవీణకు రాష్ట్ర హైకోర్టు మార్చి 2న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల ప్రకారం పూచీకత్తులు సమర్పించేందుకు ఆమె రైల్వే కోడూరు కోర్టుకు హాజరైనట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం హర్షవీణ ప్రతి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కూడా షరతు విధించింది. ఇదిలా ఉండగా యూట్యూబర్‌పై దాడి చేసి నిర్బంధించిన మరో కేసులో కూడా హర్షవీణ ఇప్పటికే బెయిల్ పొందినట్లు సమాచారం.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## గ్రామ సర్వేయర్ల ఆందోళన.... డిమాండ్లు పరిష్కరించకపోతే పునఃసర్వే పనులకు సహాయ నిరాకరణ హెచ్చరిక

మన గళం : మార్కాపురం జిల్లా కేంద్రంలో గ్రామ సర్వేయర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా సర్వేయర్ మరియు ఆదాయ విభాగ అధికారి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు ఆరు వేల గ్రామ సర్వేయర్లను మొదటి శ్రేణిగా పదోన్నతి ఇచ్చి ముప్పై వేల రూపాయలకు పైగా ప్రాథమిక వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పునఃసర్వే పనులకు తగిన సమయం, అవసరమైన పరికరాలు మరియు కార్యాలయ సామగ్రి అందించాలని కోరారు. అలాగే పునఃసర్వేకు సంబంధించిన ప్రయాణ భత్యం, దినభత్యం మరియు ఇతర బిల్లులను ప్రతి నెలకు సంబంధించినవి అదే నెలలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా పంపిన సర్వేయర్లను తమ తమ మండలాల్లోనే పనిచేసేలా చేసి ఆ నియామకాలను రద్దు చేయాలని కోరారు. శాఖ పనులు తప్ప ఇతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, కార్యాలయ సమయం ఉదయం పది ముప్పై గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల



వరకు మాత్రమే ఉండాలని తెలిపారు. వార్షిక వేతన పెంపులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమస్యలు పరిష్కరించే వరకు పునఃసర్వే పనులకు సహాయ నిరాకరణ కొనసాగిస్తామని గ్రామ సర్వేయర్లు హెచ్చరించారు.

## వెంకటాపురం తుమ్మలచెరువు జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల

మన గళండోన్ మండలంలోని వెంకటాపురం చెరువులో జంగిల్ క్లియరెన్స్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ రోజు శుక్రవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులు మరియు నీటి వనరుల అభివృద్ధి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో ముఖ్యమని తెలిపారు. చెరువులో పెరిగిన అడవి మొక్కలను తొలగించడం ద్వారా చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు మరియు నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు ప్రయోజనం కలిగే విధంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరువు ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రామ్ రెడ్డి, గోవిందు, పెద్దయ్య, మధు, బొంతిరాల తిరుపాలు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్



డైరెక్టర్ వలసల రామకృష్ణ, చంద్రన్న టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఫాలధార పంచధార వద్ద విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభం





మనగళం శ్రీశైలం : ఈ నెల 8వ తేదీన ఉదయం గం. 10.00లకు దేవస్థానం పరివార దేవాలయమైన ఫాలధార పంచధార వద్ద శ్రీ శారదాంబా సహిత జగద్గురు ఆదిశంకరాచార్యుల నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనున్నది. జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామివారు, దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం వారి కరకమలములచే ఈ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనున్నది. కాగా ఈ రోజు ( 06.03.2026) ఉదయం గం.8.00ల నుండి ఫాలధార పంచధార వద్ద ఏర్పాటు చేసిన యాగశాల వద్ద ఈ ప్రతిష్ఠా కార్యక్రామాలు ప్రారంభించబడ్డాయి. ముందుగా యాగశాల ప్రవేశం, ఆ తర్వాత వేదస్వస్తి జరిపించబడ్డాయి. అనంతరం కార్యక్రమము నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ జరిపించబడింది. తరువాతవృద్ధి అభ్యుదయాన్ని కాంక్షిస్తూ పుణ్యాహవాచనం జరిపించబడింది. తరువాత ప్రతిష్ఠా సంబంధి కైంకర్యాలలో ఆయా కార్యక్రమాలను నిర్వహించవలసినదిగా ఋత్వికులను ఆహ్వానిస్తూ ఋత్విగ్వరణం జరిపించబడింది. ఈ ప్రారంభ పూజలలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. కాగా ప్రతిష్ఠలో భాగంగా మండపారాధనలు , చర్వేదపారాయణాలు జరిపించబడ్డాయి. అనంతరం ప్రతిష్ఠశీచనున్న శారదాదేవి, ఆదిశంకరాచార్యులు మూర్తులకు జలాధివాసం, జరిపించబడింది. అదేవిధంగా సాయంత్రం గం. 4.00ల నుంచి క్షీరాధివాసము, అధివాస హోమాలు జరిపించబడుతాయి.మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలలో రేపు (07.03.2026)న ఉదయం ధాన్యాధివాసం, సాయంత్రం పుష్పాధివాసం, శయ్యాధివాసం, అధివాస హోమాలు, జరిపించబడుతాయి. అదేవిధంగా మార్చి 8వ తేదీన ఉదయం గం.8.00ల నుంచి అధివాసహోమాలు, నేత్రోన్మీలనము, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరిపించబడుతాయి. తరువాత ఆ రోజు ఉదయం గం. 11.00ల నుంచి శ్రీ శారదాంబా సహిత ఆదిశంకరాచార్యుల నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించబడుతుంది.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (06.03.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతీ శు క్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన దమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## 200 రోజులకు పైగా చెల్లుబాటుతో జియో ప్లాన్లు

హైదరాబాద్ 6 మార్చి ,మనగళం : తరచుగా రీఛార్జ్ చేసుకోవడం ఇబ్బందిగా భావించే వినియోగదారుల కోసం ప్రముఖ టెలికాం సంస్థ జియో అనేక దీర్ఘకాలిక ప్రీపెయిడ్ ప్లాన్‌లను అందిస్తోంది. ముఖ్యంగా 200 రోజులకు పైగా చెల్లుబాటు కలిగిన ప్లాన్‌లకు ఇటీవల మంచి డిమాండ్ కనిపిస్తోంది. కాలింగ్ మాత్రమే అవసరమయ్యే వినియోగదారుల నుంచి ఎక్కువ డేటా ఉపయోగించే వారికి వరకు విభిన్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్లాన్‌లను రూపొందించారు. 200 రోజుల నుంచి దాదాపు ఏడాది వరకు చెల్లుబాటు కలిగిన ఈ ప్లాన్‌లు వినియోగదారులకు సౌకర్యంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్లాన్‌లలో ఒకటి రూ.1748 ప్రీపెయిడ్ ప్లాన్. ఈ ప్లాన్ ప్రత్యేకత ఏమిటంటే ఇది మొత్తం 336 రోజుల చెల్లుబాటుతో అందుబాటులో ఉంటుంది. అంటే దాదాపు 11 నెలల పాటు మీ నంబర్ యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఇంటర్నెట్ అవసరం లేకుండా కేవలం కాలింగ్ కోసం మాత్రమే సిమ్ ఉపయోగించే వారికి ఇది అనుకూలంగా ఉంటుంది. ఈ ప్లాన్‌లో అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాలింగ్‌తో పాటు మొత్తం 3600 సందేశాల సౌకర్యం కూడా ఉంటుంది. మొబైల్ డేటా అందించకపోయినా వినోద సేవల కోసం జియో టీవీ వంటి సేవలు, అలాగే 50 జీబీ క్లౌడ్ నిల్వ సౌకర్యం కూడా ఇందులో లభిస్తుంది.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ





మనగళం శ్రీశైలం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 7న ఈ కుంభోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మ వారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అనగా ఈ రోజున ( 06.03.2026) అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మ వారికి ఈ కొబ్బరి కాయలు సమర్పించబడ్డాయి.

## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 06.03.2026) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది.కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితి రోజులు మరియు పౌర్ణమి రోజులలో శ్రీ సాక్షి గణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.ఈ ఉదయం సాక్షి గణపతి స్వామి వారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

## అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం




మనగళం శ్రీశైలం : శ్రీ ఆర్ .పెద్ద నాగ సుబ్బా రెడ్డి, కర్నూల్ వారు ఈ రోజు ( 06.03.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00116/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

## బిజెపి యువ మోర్చా నాయకులని సన్మానించిన బిజెపి యువకులు




మన గళండోన్ నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ యువమోర్చా నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శ్రీ ఎస్. విజయ్ భాస్కర్కి, అలాగే నంద్యాల జిల్లా బిజెపి యువమోర్చా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన అరుణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని ఖబఎఎష్ఘుఎుఖుతీఞు =వర్ఘుబతీఘుత్ వద్ద శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సన్మాన కార్యక్రమం జరిగింది. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి శ్రీ రామచంద్ర నాయుడు, బిజెపి ఆర్మీ రామయ్య, బిజెపి ముదిరాజ్ నాయకులు లక్ష్మీనారాయణ, బిజెపి యువ నాయకులు రాజపుత్ కమలేష్, అశోక్, సురేష్, మధు, వెంకటరెడ్డి మరియు వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షులు బోయే ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఎస్. విజయ్ భాస్కర్ యువతలో చైతన్యం కలిగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని, అలాగే అరుణ్ కుమార్ యువమోర్చా కార్యక్రమాలను జిల్లాలో మరింత విస్తరింపజేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి, యువత సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చివరగా సన్మానితులు పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే తమ ధ్యేయమని తెలిపారు.

## మార్కాపురం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన







మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (04.03.2026) డా. కె. లక్ష్మీశ్వేత మరియు వారి బృందం, మార్కాపురం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో గణపతి స్తుతి, శివశివ శంకరా, శివతాండవం, ఓం నమశ్శివాయ తదితర గీతాలకు శ్రీవల్లి, అలకనందనదేవి,వినూత్న తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## ఫాలధార పంచధార వద్ద శ్రీ శారదాంబా సహిత ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ



మనగళం శ్రీశైలం : ఈ నెల 8వ తేదీన ఉదయం గం. 10.00లకు దేవస్థానం పరివార దేవాలయమైన ఫాలధార పంచధార వద్ద శ్రీ శారదాంబా సహిత జగద్గురు ఆదిశంకరాచార్యుల నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనున్నది.జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామివారు, దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం వారి కరకమలములచే ఈ ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనున్నది. కాగా దేవస్థానం వైదిక కమిటీ వారి సూచనల మేరకు ఈ ప్రతిష్ఠా కార్యక్రమం మార్చి 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహింపబడనున్నది. మార్చి 6వ తేదీన ఉదయం గం.8.00ల నుండి ఫాలధార పంచధార వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, మండపారాధనలు, చతుర్వేదపారాయణం, జలాధివాసం కార్యక్రమాలు జరిపించబడుతాయి. అదేవిధంగా ఆ రోజు సాయంత్రం క్షీరాధివాసము, అధివాస హోమములు జరిపించబడుతాయి. కార్యక్రమములో రెండవ రోజైన మార్చి 7వ తేదీన అధివాసహోమములు, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాలు జరిపించబడుతాయి. అదేవిధంగా మార్చి 8వ తేదీన ఉదయం గం.8.00ల నుంచి అధివాసహోమములు, నేత్రోన్మీలనము, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరిపించబడుతాయి. తరువాత ఉదయం గం. 11.00ల నుంచి శ్రీ శారదాంబా సహిత ఆదిశంకరాచార్యుల నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించబడుతుంది. కావున భక్తులందరు కూడా ఈ కార్యక్రమాలలో పాల్గొని తరించవలసినదిగా కోరుచున్నాము.

## నరసప్ప కుటుంబానికి స్థానిక టిడిపి నాయకులు ఆర్థిక సహాయం



మన గళం కోడుమూరు : కోడుమూరు పట్టణంలో నరసప్ప బావిలో పడి మృతి చెందిన కెంచుగుండు వీరేష్ మృతికి టిడిపి మండల కన్వీనర్ అనుగొండ రామకృష్ణ రెడ్డి, టౌన్ అధ్యక్షులు గంగాధర్ నాయుడు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, టీడీపీ పార్టీ తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కర్నూలు జిల్లా కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో మట్టి ఖర్చులకు టౌన్ అధ్యక్షులు గంగాధర్ నాయుడు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

## శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (06.03.2026 ) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. అప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## సాంస్కృతిక కార్యక్రమాలు




మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (06.03.2026) ఎ. భాగ్యలక్ష్మి మరియు వారి బృందం, కర్నూలు వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతిని సేవింపరారే, కైలాసనాథ శ్రీగిరివాసా, భో..శంభో శివశంభో, శంభోమహాదేవ, నమశ్శివాయా నటేశ్వరాయ, సాంబశివాసదాశివ పలు శివకీర్తనలను భాగ్యలక్ష్మి, పుష్పలీలావతి, గాయత్రిలు ఆలాపించనున్నారు. ఈ కార్యక్రమానికి వయోలిన్ సహకారాన్ని రమణయ్య, తబలా సహకారాన్ని వెంకటేశ్వర్లు అందించనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.శ్రీ స్వామి అమ్మ వార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

### శ్రీ మల్లిఖార్జున స్వామి అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం



మనగళం శ్రీశైలం : శ్రీమతి వి రమణమ్మ, హైదరాబాద్ వారు ఈ రోజు ( 06.03.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,001/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. శివప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

## నందివర్గంలో ఘనంగా అల్లా బకాష్ మియ్యా గారి ఉరుసు ముఖ్యఅతిథిగా హాజరైన బిసి రాజారెడ్డి



మన గళం: బనగానపల్లె మండలం నందివర్గం గ్రామంలో శ్రీ అల్లా బకాష్ మియ్యా ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ప్రారంభించారు నందివర్గం గ్రామంలో ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు శ్రీ అల్లా బకాష్ మియ్యా ఉరుసు ఘనంగా నిర్వహిస్తున్నారు అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 పండ్ల విభాగానికి సంబంధించి బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు ముందుగా ఈ కార్యక్రమానికి హాజరైన బిసి రాజారెడ్డికి టిడిపి నాయకుడు మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు అనంతరం బిసి రాజారెడ్డి శ్రీ అల్లా బకాష్ మియ్యా దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి బండలాగుడు పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ బండలాగుడు పోటీలు వృషభరాజ్యముల పౌరుషానికి ప్రతీక అన్నారు మన రాయలసీమ ప్రాంతంలో రైతు సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసే బండలాగుడు పోటీలను తిలకించేందుకు రైతులు ప్రజలు ఎంతో ఆసక్తి కనబరుస్తారన్నారు ఉరుసు సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు అనంతరం నిర్వాహకులు బిసి రాజారెడ్డికి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు బండలాగుడు పోటీలో మొత్తం 12 ఎడ్ల జతలు పాల్గొన్నాయని విజేతలుగా నిలిచిన ఎడ్ల జతలకు మొదటి బహుమతి కింద రూ.50,000 రెండో బహుమతి రూ.40,000 మూడో బహుమతి రూ.30,000 నాలుగో బహుమతి రూ.25000 ఐదవ బహుమతి రూ.20000 చొప్పున అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

# సంపాదకీయం

## రైతుల సంక్షేమమే ఆహార భద్రతకు పునాది



మన గళం డెస్క్ : భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోంది. కోట్లాది మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల గ్రామీణ వ్యవసాయం బలోపేతం కావడం దేశ భవిష్యత్తుకు అత్యంత అవసరం. రైతుల సంక్షేమం, పంటల ఉత్పత్తి, ఆహార భద్రత వంటి అంశాలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయి. వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ప్రస్తుతం రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, పెరుగుతున్న సాగు ఖర్చులు వంటి సమస్యలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంటలకు సరైన ధరలు లభించకపోవడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులకు సరైన మద్దతు అందించడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారింది. రైతులకు ఆర్థిక సహాయం, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలి.

వ్యవసాయ రంగంలో పంటల మార్పు కూడా ఎంతో అవసరం. ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ధాన్యాలతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, తోటపంటలు వంటి పంటలను కూడా సాగు చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగవచ్చు. సాంప్రదాయ ధాన్యాలు అయిన జొన్నలు, రాగులు, సామలు వంటి సిరిధాన్యాల సాగు కూడా రైతులకు మంచి అవకాశాలను అందిస్తోంది. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ కూడా పెరుగుతోంది. దేశంలో ఆహార భద్రతను కాపాడటంలో ధాన్యాల ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తుంది. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందువల్ల ధాన్యాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం మరియు రైతులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన విత్తనాలు, సాగు సాంకేతికతలను వినియోగించడం ద్వారా పంటల దిగుబడిని పెంచవచ్చు. ఈ విధంగా వ్యవసాయ రంగంలో ఆధునికతను తీసుకురావడం ద్వారా రైతులకు మంచి లాభాలు సాధ్యమవుతాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వ్యవసాయం ఒక ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. రైతుల ఆదాయం పెరిగితే గ్రామాల్లో ఆర్థిక చలనం పెరుగుతుంది. రైతులు బలపడితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయానికి అనుబంధ రంగాలు అయిన పశుపోషణ, కోళ్లు పెంపకం, తేనెటీగల పెంపకం వంటి రంగాలు కూడా గ్రామీణ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి సరైన విధానాలు అవసరం. రైతులకు సాగు ఖర్చులను తగ్గించే విధంగా సహాయాలు అందించాలి. సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళ్లడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది.సాగునీటి సదుపాయాలు, నిల్వ గోదాములు, మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి. రైతులు పండించిన పంటలకు సరైన ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి మరియు సరైన సమయంలో మార్కెట్‌కు తీసుకెళ్లడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానం కూడా వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, సమాచార సాంకేతికత వినియోగం ద్వారా రైతులు తమ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు, పంటల సంరక్షణ పద్ధతులు వంటి విషయాలను రైతులకు సులభంగా అందించడం ద్వారా వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.


గ్రామీణ వ్యవసాయం కేవలం ఆహారం ఉత్పత్తి చేసే రంగం మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలమైన ఆధారం. రైతులు బలపడితే దేశం బలపడుతుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం పురోగమిస్తుంది. అందువల్ల గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విషయం. రైతులకు అవసరమైన మద్దతు అందించడం, పంటల ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లడం వంటి చర్యలు తీసుకుంటేనే దేశ ఆహార భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం మరింత బలపడుతుంది. గ్రామీణ వ్యవసాయం నిజంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన శక్తిగా నిలుస్తోంది.

## ఇజ్రాయెల్ విడుదల చేసిన వీడియోపై సోషల్ మీడియాలో చర్చ

**- ఇరాన్ హెలికాప్టర్ ధ్వంసం చేశామని ఐడీఎఫ్ ప్రకటన - వీడియోపై నెటిజన్ల సందేహాలు - నకిలీ లక్ష్యాలపై చర్చ**

మన గళం డెస్క్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో యుద్ధం కేవలం క్షిపణులు, బాంబులతోనే కాకుండా సమాచార యుద్ధంగా కూడా సాగుతోంది. తాజాగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు విడుదల చేసిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఇరాన్‌కు చెందిన ఒక హెలికాప్టర్‌ను క్షిపణితో ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించగా, ఆ వీడియో నిజస్వరూపంపై నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయెల్ రక్షణ దళాలు విడుదల చేసిన వీడియోలో ఒక హెలికాప్టర్ నేలపై పార్క్ చేసి ఉండగా, క్షిపణి వచ్చి దానిని ఢీకొట్టినట్లు కనిపిస్తోంది. ఈ వీడియోను పంచుకుంటూ ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీశామని ఇజ్రాయెల్ పేర్కొంది. అయితే వీడియోను పరిశీలించిన కొంతమంది నెటిజన్లు, విశ్లేషకులు ఆ హెలికాప్టర్ నిజమైనది కాదని వాదిస్తున్నారు. కొంతమంది అభిప్రాయం ప్రకారం ఆ హెలికాప్టర్ నేలపై వేసిన భారీ చిత్రంలా కనిపిస్తున్నదని పేర్కొంటున్నారు. ఎండలో ఉన్న వస్తువులకు సాధారణంగా నీడ కనిపిస్తుందని, కానీ వీడియోలో ఉన్న హెలికాప్టర్‌కు నీడ లేకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. క్షిపణి తగిలిన తర్వాత హెలికాప్టర్ ముక్కలు కావడం కాకుండా నేలపై ఉన్న రంగు చెదిరినట్లుగా కనిపిస్తోందని కూడా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

యుద్ధ సమయంలో శత్రువులను మోసం చేయడానికి నకిలీ లక్ష్యాలను ఉపయోగించడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. ఇరాన్ కూడా ఖరీదైన క్షిపణులను వృథా చేయించేందుకు ఇలాంటి వ్యూహాన్ని ఉపయోగించి ఉండవచ్చని సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ విమర్శలపై ఇజ్రాయెల్ రక్షణ దళాలు



ఇంకా అధికారికంగా స్పందించలేదు. అదే సమయంలో క్షిపణి వ్యవస్థలు కేవలం దృశ్యాలపై మాత్రమే కాకుండా వేడి గుర్తించే సాంకేతికత ఆధారంగా కూడా పనిచేస్తాయని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పరీక్షకు వెళ్లిన అక్కాతమ్ముళ్లను బాబాయ్ హత్య

**- మధ్యప్రదేశ్‌లో దారుణ ఘటన - కుటుంబ ఆస్తి వివాదమే కారణమని అనుమానం**

మన గళం డెస్క్ : చేతిలో హాల్‌టిక్కెట్లు పట్టుకుని పరీక్షా కేంద్రానికి బయలుదేరిన అక్కాతమ్ముళ్లను వారి సొంత బాబాయ్ హత్య చేసిన ఘటన మధ్యప్రదేశ్‌లో కలకలం రేపింది. సీహోర్ జిల్లాలోని ధరమ్‌పురి గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కుటుంబ ఆస్తి వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ధరమ్‌పురి గ్రామానికి చెందిన శీతల్ (20), కుల్దీప్ (18) శుక్రవారం ఉదయం తమ బోర్డు పరీక్షలకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఇంటి నుంచి కొద్దిదూరం వెళ్లగానే దారిలో పొంచి ఉన్న వారి బాబాయ్ హరిసింగ్ మాలవీయ కర్రతో దాడి చేశాడు. విచక్షణారహితంగా దాడి చేయడంతో ఇద్దరూ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం. పరీక్షలకు వెళ్లిన పిల్లలు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి చేతిలో ఉన్న హాల్‌టిక్కెట్లు రక్తంతో తడిసిపోవడం గ్రామస్తులను కలచివేసింది. పిల్లలు చదువుకుని కుటుంబానికి వెలుగునిస్తారని ఆశించిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ ఆస్తి తగాదాలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దారుణానికి



పాల్పడిన హరిసింగ్‌పై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జంట హత్యలతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. హత్య అనంతరం పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## చౌక ధరల మందులతో ఆరోగ్యానికి భరోసా

- పేదలకు అందుబాటులో నాణ్యమైన ఔషధాలు - జనఔషధి కేంద్రాలతో వైద్య ఖర్చులకు తగ్గింపు

మన గళం డెస్క్ : దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 7న జనఔషధి దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రజలకు చౌక ధరలో నాణ్యమైన ఔషధాలు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోంది. సాధారణంగా వైద్య చికిత్సలో మందుల ఖర్చు చాలా ఎక్కువగా ఉండటంతో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జనఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలో నాణ్యమైన మందులను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతున్నాయి. వైద్య రంగంలో ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో చౌక ధరలో మందులు అందుబాటులో ఉండడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పథకాన్ని అమలు చేస్తూ దేశవ్యాప్తంగా వేలాది జనఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో సాధారణంగా మార్కెట్‌లో లభించే బ్రాండ్ మందులతో సమానమైన నాణ్యత కలిగిన జనరిక్ మందులను చాలా తక్కువ ధరకు అందిస్తున్నారు. దీని వల్ల ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పోతోంది. జనఔషధి కేంద్రాల ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ అందించే మందులు నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా తయారు చేయబడతాయి. ప్రభుత్వం గుర్తించిన ఔషధ తయారీ సంస్థల ద్వారా ఈ మందులు తయారవుతాయి. నాణ్యతను నిర్ధారించేందుకు కఠినమైన పరీక్షలు నిర్వహిస్తారు. అందువల్ల ఈ కేంద్రాల్లో లభించే మందులు మార్కెట్‌లోని ఇతర మందులతో సమానంగా ప్రభావవంతంగా ఉంటాయి. తక్కువ ధరలో లభించడమే కాకుండా నాణ్యత కూడా ఉన్నందున ప్రజలు ఈ కేంద్రాలను విశ్వసిస్తున్నారు.

దేశంలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, మహానగరాలు అన్న తేడా లేకుండా జనఔషధి కేంద్రాలు విస్తరించబడుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో వేలాది కేంద్రాలు ప్రస్తుతం ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వీటి ద్వారా సాధారణ ప్రజలు తమకు అవసరమైన మందులను చాలా తక్కువ ధరలో కొనుగోలు చేయగలుగుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా మారింది. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలకు అవసరమైన మందులు కూడా జనఔషధి కేంద్రాల్లో చౌక ధరలకు అందుబాటులో ఉన్నాయి. జనఔషధి కేంద్రాల ద్వారా మందులు కొనుగోలు చేయడం వల్ల ప్రజల వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతున్నాయి. సాధారణంగా మార్కెట్‌లో లభించే కొన్ని మందులు చాలా ఖరీదుగా ఉంటాయి. అయితే అదే మందులు జనఔషధి కేంద్రాల్లో చాలా తక్కువ ధరకు లభిస్తాయి. దీని వల్ల కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అనేక మంది ప్రజలు ఇప్పటికే ఈ కేంద్రాల ప్రయోజనాలను అనుభవిస్తున్నారు.

ఈ పథకం మరో ముఖ్యమైన ప్రయోజనం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం. జనఔషధి కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. దీనివల్ల యువకులు మరియు ఔషధ రంగంలో చదువుకున్న వారు తమ స్వంత కేంద్రాలను ప్రారంభించి ఉపాధి పొందుతున్నారు. ఈ విధంగా ఈ పథకం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతోంది. జనఔషధి దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, సమావేశాలు నిర్వహిస్తారు. ప్రజలకు చౌక ధరలో మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేసేందుకు వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వైద్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో కూడా ఈ పథకం గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత మంది ప్రజలకు సమాచారం చేరుస్తున్నారు.


ప్రస్తుతం దేశంలో వేలాది జనఔషధి కేంద్రాలు పనిచేస్తూ లక్షలాది మందికి సేవలు అందిస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను నిజం చేస్తూ తక్కువ ధరలో నాణ్యమైన మందులను అందించడంలో జనఔషధి పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రజలకు ఆర్థిక భారం తగ్గిస్తూ ఆరోగ్య భద్రతను కల్పించడంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. జనఔషధి దినోత్సవం ద్వారా ఈ పథకం ప్రాముఖ్యతను ప్రజలకు మరింతగా తెలియజేస్తూ ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో సాధారణంగా మార్కెట్‌లో లభించే మందులతో సమానమైన నాణ్యత కలిగిన ఔషధాలను చాలా తక్కువ ధరలో అందిస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఈ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం వల్ల ప్రజలపై పడే వైద్య ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. జనఔషధి కేంద్రాలు గ్రామాలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా విస్తరించబడుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో వేలాది కేంద్రాలు దేశవ్యాప్తంగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. దీని వల్ల సాధారణ ప్రజలు పెద్ద ఖర్చు లేకుండా అవసరమైన మందులను పొందగలుగుతున్నారు. అంతేకాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కూడా ఈ కేంద్రాల ద్వారా కలుగుతున్నాయి. జనఔషధి దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, ప్రజలకు సమాచారం అందించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా జనఔషధి కేంద్రాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తున్నారు. తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందుబాటులో ఉండడం వల్ల ప్రజల ఆరోగ్య భద్రతకు ఈ పథకం ముఖ్యమైన ఆధారంగా నిలుస్తోంది.

## ఇంటింటికి మీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి

- ప్రజల సమస్యలు పరిష్కరించడం నా ధ్యేయం.







(ఆలూరు మనగళం): ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి నిర్వహిస్తున్న "ఇంటింటికి వైకుంఠం జ్యోతి" కార్యక్రమం సందర్భంగా హత్తిబెళగల్ గ్రామాన్ని సందర్శించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామంలోని లింగాయతీ కాలనీ వాసులు తమ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మించాలని కోరారు. గ్రామస్తులకు ఇచ్చిన మాట మేరకు, హత్తిబెళగల్ గ్రామంలోని మిషిని బసన్న ఇంటి నుండి పాత పంచాయతీ కార్యాలయం వరకు సుమారు 100 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణం ఈ రోజు పూర్తి చేయబడింది. ఈ రహదారి నిర్మాణానికి సుమారు రూ.6 లక్షలు వ్యయం చేయబడింది. ఈ సందర్భంగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించినందుకు వైకుంఠం జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించడం నా బాధ్యత. ఆలూరు నియోజకవర్గం అభివృద్ధే మా లక్ష్యం" అని ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి తెలిపారు.

## వినియోగదారుల సేవల్లో లోపాలు..

హైదరాబాద్ 6 మార్చి ,మనగళం : ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల సేవల రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను విశ్లేషిస్తూ తాజాగా విడుదలైన 2026 వినియోగదారుల అనుభవ నివేదిక పలు కీలక అంశాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ అధ్యయనం ప్రకారం భారతదేశంలోని కార్పొరేట్ సేవా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పెరుగుతున్నప్పటికీ, సంస్థల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల వినియోగదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సేవల లోపాలను సరిచేసుకోవడానికి వినియోగదారులు ఏడాదికి సగటున దాదాపు పదిన్నర గంటల విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. సేవల అందుబాటులో ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉన్నప్పటికీ, వాటి మధ్య సరైన అనుసంధానం లేకపోవడం వల్ల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని పరిశోధన తెలిపింది.

సంస్థల్లో కృత్రిమ మేధస్సు వినియోగం పెరుగుతున్నప్పటికీ, డేటా వ్యవస్థలు మరియు సేవా నిర్వహణ పద్ధతులు పరస్పరం సమన్వయంతో పనిచేయకపోవడం పెద్ద సమస్యగా మారిందని నివేదిక పేర్కొంది. ఒక వినియోగదారుని సమస్యను పరిష్కరించేందుకు సేవా ప్రతినిధులు సగటున నాలుగు వేర్వేరు వ్యవస్థలను ఉపయోగించాల్సి వస్తోందని, దీనివల్ల గందరగోళం ఏర్పడి సమస్య పరిష్కార ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోందని వెల్లడించింది. ఈ పరిస్థితుల కారణంగా దాదాపు నలభై నాలుగు శాతం మంది వినియోగదారులు ప్రస్తుత సంస్థలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అవసరమైతే ఇతర సంస్థల సేవలను ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నారని అధ్యయనం తెలిపింది. ఇది సంస్థల విశ్వసనీయతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇక వినియోగదారుల అభిప్రాయాల ప్రకారం వేగవంతమైన సేవలతో పాటు మానవీయ స్పందన కూడా అత్యంత ముఖ్యమని నివేదిక స్పష్టం చేసింది. తమ సమస్యలను సంస్థలు సానుభూతితో అర్థం చేసుకోవడం లేదని దాదాపు నలభై ఎనిమిది శాతం మంది వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం యంత్రాల ఆధారిత ప్రతిస్పందనలు లేదా స్వయంచాలక సందేశాలతో సమస్యలు పరిష్కారం కావని, మానవీయ కోణంలో స్పందించే సేవలు అవసరమని వారు భావిస్తున్నారు.

నిపుణుల అభిప్రాయం ప్రకారం కృత్రిమ మేధస్సు మనుషులకు ప్రత్యామ్నాయం కాదని, అది సేవలను మెరుగుపరచే సహాయక సాధనం మాత్రమేనని ఈ నివేదిక సూచిస్తోంది. భవిష్యత్తులో వినియోగదారుల నమ్మకాన్ని పొందాలంటే సంస్థలు కేవలం లాభాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, సాంకేతికతతో పాటు మానవీయ విలువలను కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సమగ్ర డిజిటల్ వేదికలు, సమన్వయంతో పనిచేసే సేవా వ్యవస్థలు మరియు వినియోగదారుల భావోద్వేగాలను అర్థం చేసుకునే విధానాలను అమలు చేసే సంస్థలే భవిష్యత్తులో ముందంజలో నిలుస్తాయని నివేదిక స్పష్టం చేసింది.

# కామ్రేడ్ సోమన్న ఆశయాలను కొనసాగిద్దాం సిపిఎం



సిపిఎం కర్నూలు జిల్లా కమిటీ సభ్యుడు, సిపిఎం కోడుమూరు మాజీ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సోమన్న 4 వ వర్ధంతి సభ గూడూరులోని సిఐటియు కార్యాలయంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది, ముందుగా సోమన్న గారి చిత్రపటానికి సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జే, మోహన్, ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది,,

ఈ సందర్భంగా ప్రాంతీయ కార్యదర్శి జయ మోహన్ మాట్లాడుతూ కామ్రేడ్ సోమన్న గారు విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు ఉద్యమాలలో పాల్గొంటూ విద్యార్థి సంఘం నాయకుడిగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా, ఎదిగాడని, కోడుమూరు సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శిగా చాలా ఏళ్లపాటు పనిచేశారని, ఆ విధంగా కోడుమూరు తో పాటు గూడూరు, బెలగల్ మండలాల్లో త్రాగునీటి సమస్య మీద, భూమి లేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని అనేక ఉద్యమాలు చేశాడని, అదేవిధంగా రైతుల సమస్యలు అయితేనేమి, వ్యవసాయ కార్మికుల సమస్యలైతేనేమి, కార్మికుల సమస్యలు అయితే నేమి వారి సమస్యలను తన భుజాల మీద వేసుకొని పోరాటాలు చేశాడని, నిత్యం ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశాడని, అటువంటి గొప్ప వ్యక్తి ఆశయ సాధన కోసం పార్టీ ప్రతి సభ్యుడు పనిచేస్తే అప్పుడే సోమన్న నిజమైన నివాళులు అర్పించడం అవుతుందని, సోమన్న ఆశయాలకు పార్టీ సభ్యులందరూ కొనసాగించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దిలేటి, మధు, హమాలి సంఘం నాయకులు మద్దిలేటి, మల్లికార్జున, భూత రామాంజనేయులు, మద్దిలేటి, వీరబాబు, లోకేష్, మల్లు, గజ్జలన్న, తదితరులు పాల్గొన్నారు

## వైస్ ఎంపీపీ గుండారెడ్డిని పరామర్శించిన వైసీపీ యువ నాయకులు



పెద్దారవీడు మన గళం : మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి గాయాలైనవి ఈ నేపథ్యంలో. గుంటూరు జిల్లా నరసరావుపేట ప్రవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ విషయాన్ని తెలుసుకొని వైసిపి యువ నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ యువజన విభాగ కార్యదర్శి ఏరువ శేష సేనా రెడ్డి. జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు వెన్న శివకృష్ణారెడ్డి. మండల ఉపాధ్యక్షులు సర్పంచ్ ఆవులయ్య యాదవ్. సర్పంచ్ రామాంజనేయరెడ్డి. వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. వెంకటేశ్వర్ రెడ్డి గత మూడు నాలుగు రోజుల క్రితం దేవరాజు గట్టును ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న నేపథ్యంలో ప్రమాదవశాత్తుతో జారి పడటంతో స్వల్ప గాయాలైనట్లు వారు తెలిపారు. వారికి ధైర్యం చెప్పి త్వరగా కోరుకునే విధంగా వైద్యం అందించాలని వైద్య సిబ్బందితో మాట్లాడినట్లు వాళ్ళు తెలిపారు.

## కోడుమూరు సిపిఎం పార్టీ ఆఫీస్ లో కామ్రేడ్ సోమన్న మూడవ వర్ధంతి



మన గళం కోడుమూరు: : కోడుమూరు పుచ్చలపల్లి సుందరయ్య భవన్. సిఐటియు మండల అధ్యక్షులు.జి.పి వీరన్న అధ్యక్షతన కామ్రేడ్ సోమన్న నాలుగవ వర్ధంతి కోడుమూరు సిపిఎం పార్టీ ఆఫీస్ నందు జరిగాయి ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి కామార్తి రాజు సీనియర్ నాయకులు జీ.కే.వి నరసింహమూర్తి.టి.విరన్న కే.లక్ష్మన్న. సోమన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కామర్తి.రాజు మాట్లాడుతూ.కోడుమూరు డివిజన్ కార్యదర్శిగా చాలా ఏళ్లపాటు పనిచేశారు కోడుమూరు గ్రామంలో.త్రాగునీటి సమస్య మీద గ్రామానికి మరియు చుట్టుపక్కల గ్రామాలరైతుల సమస్యలు అయితే నేమి వ్యవసాయ కార్మిక సమస్యల వారు పోరాడారు అలాగే ప్రతి కార్మికుల సమస్య తన భుజాన వేసుకుని పని చేసే వ్యక్తి ఆయన అను నిత్యం ప్రజల కోసం తన.జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తిగా ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా నిత్యం ప్రజల కోసం పని చేద్దామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గొర్ల సంఘం ప్యాలకుర్తి మద్దిలేటి ఎస్.గంగాధరు కే.బుడ్డప్ప. నక్క గిడ్డయ్య. గొల్ల కృష్ణ. తదితరులు

## సున్నిపెంట లో భారతీయ జనతా పార్టీఆత్మీయ సమావేశం





మనగలం : శ్రీశైలం మండలం లో నేడు అనగా శుక్రవారం రోజున రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ గారు మరియు జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆదేశాల మేరకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు ఈ కార్యక్రమం ముఖ్య అతిథి చదువుల శ్రీను ( భారతీయ జనతా పార్టీ శ్రీశైలం మండల అధ్యక్షులు) విచ్చేసారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం, సుండి పెంట, లింగాల గట్టు నుండి గిల్లి వెంకటేశ్వర్లు గారు, వాల్మీకి చంద్రకళ గారు, మండల రామకృష్ణ గారు, చిక్కుడు చెట్టు వెంకటేశ్వర్లు గారు, సోంశెట్టి మల్లికార్జున గారు కార్యకర్తలు మరియు సీనియర్ నాయకులు మరియు అభిమనులు పాల్గొన్నారు మొదటగా నూతంగా ఎన్నుకున్న యువ మోర్చా, ఓబీసీ మోర్చా, మైనార్టీ మోర్చా, ఎస్సీ మోర్చా అధ్యక్షులను సభాముఖంగా సన్మానించారు చదువుల శ్రీను గారు సభను ఉదేశించి మాట్లాడుతు పార్టీ బలోపేతం చేయుటకు దిశా నిరద్దెశం చేసారు ప్రతి కార్యకర్త కుటుంబం లో ఒక భాగం అని తెలియచేసారు ప్రతి ఒక పథకం మొదట కార్యకర్తలు తీసుకొని ప్రజలకు తెలియచేయాలి అదేవిందంగా ప్రజల సమస్య లు కూడా తెలుసుకొని పరిష్కరించే విధంగా కార్యకర్త ఎదగాలి అని తెలియజేశారు

## విమానం రద్దు లేదా ఆలస్యమైతే బీమా సొమ్ము వస్తుందా..?

హైదరాబాద్ 6 మార్చి ,మనగళం: ఇరాన్ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేపట్టడం, అదే సమయంలో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు చేయడం వల్ల ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల ప్రభావంతో అనేక అంతర్జాతీయ విమానాలు రద్దు అవుతుండగా, మరికొన్ని విమానాలను ఇతర మార్గాలకు మళ్లిస్తున్నారు. హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాల నుంచి బయలుదేరే కొన్ని విమానాలు కూడా రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విమానం రద్దు అయితే లేదా ఆలస్యమైతే ట్రావెల్ బీమా వర్తిస్తుందా అనే సందేహం చాలామందిలో వ్యక్తమవుతోంది. నిపుణుల ప్రకారం, విమానం ఆలస్యం లేదా రద్దు అయిన ప్రతిసారి ఆటోమేటిక్‌గా బీమా పరిధిలోకి వస్తుందని అనుకోవడం సరైంది కాదని చెబుతున్నారు. ప్రయాణ బీమా పాలసీ నిబంధనలు, అలాగే అంతరాయం ఏర్పడిన కారణం ఆధారంగా మాత్రమే పరిహారం లభిస్తుంది. ఉదాహరణకు తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, విమాన సిబ్బంది సమ్మెలు, విమానంలో సాంకేతిక లోపాలు వంటి కారణాల వల్ల విమానం ఆలస్యం అయినా లేదా రద్దయినా కొన్ని పాలసీలలో బీమా వర్తించే అవకాశం ఉంటుంది. అయితే యుద్ధ పరిస్థితులు, భద్రతా సమస్యలు వంటి అంశాలు కొన్ని పాలసీలలో మినహాయింపుగా కూడా ఉండొచ్చు. అందువల్ల ప్రయాణికులు తమ బీమా పాలసీ నిబంధనలను ముందుగానే తెలుసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక





# ఖాళీ కడుపుతో ఉంటే మెదడు చురుకుగా పనిచేస్తుంది

మన గళం, ఆరోగ్యం : ప్రస్తుతం చాలా మంది బరువు తగ్గడం కోసం, అలాగే మెదడు చురుకుగా ఉండేందుకు అడపాదడపా ఉపవాసాన్ని అనుసరిస్తున్నారు. గతంలో ఖాళీ కడుపుతో ఉంటే మెదడు సరిగా పనిచేయదని భావించేవారు. అయితే తాజా పరిశోధనలు మాత్రం కొన్ని గంటలు ఉపవాసంగా ఉండటం వల్ల మెదడు మరింత చురుకుగా పనిచేస్తుందని చెబుతున్నాయి. ఖాళీ కడుపుతో పని చేస్తే ఏకాగ్రత పెరగడంతో పాటు ఆలోచనా శక్తి కూడా మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మనకు ఆకలి వేసినప్పుడు శరీరం మరింత అప్రమత్తంగా పనిచేస్తుంది. పూర్వకాలంలో మనుషులు ఆకలిగా ఉన్నప్పుడు వేటకు వెళ్లి ఆహారం సంపాదించేవారు. అందువల్ల ఆ సమయంలో మెదడు ఎక్కువగా చురుకుగా పనిచేసేలా శరీరం స్వభావంగా మారిందని నిపుణులు చెబుతున్నారు. ఖాళీ కడుపుతో పని చేస్తే పనిపై దృష్టి పెరిగి ఏకాగ్రత మెరుగుపడుతుంది. ఉపవాసం సమయంలో శరీరం దెబ్బతిన్న కణాలను తొలగించే ప్రక్రియను ప్రారంభిస్తుంది. కొంత సమయం ఆహారం తీసుకోకపోతే పాత, దెబ్బతిన్న కణాలను శరీరం తొలగించుకునే అవకాశం లభిస్తుంది. దీనివల్ల మెదడు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే మెదడులో నేర్చుకునే ప్రక్రియకు సహాయపడే ప్రత్యేక ప్రోటీన్ ఉత్పత్తి కావడం వల్ల కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. అడపాదడపా ఉపవాసం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యం అవుతాయి. దీంతో శరీరానికి స్థిరమైన శక్తి లభించి అలసట తగ్గుతుంది. అలాగే ఆకలిని నియంత్రించడం వల్ల మానసిక క్రమశిక్షణ పెరుగుతుంది. అయితే ఉపవాసం చేసే సమయంలో తగినంత నీరు తాగడం, మొదట చిన్న సమయంతో ప్రారంభించడం అవసరం. ఉపవాసం ముగిసిన తర్వాత తేలికపాటి, పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

# పెరుగుపై ఉన్న అపోహలపై వివరణ



## - జీర్ణక్రియకు పెరుగు ఎంతో మేలు

మన గళం, ఆరోగ్యం : చాలా మంది ఆహారంలో భాగంగా పెరుగును తీసుకుంటూ ఉంటారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా తినే ఆహారాల్లో ఇది కూడా ఒకటి. పెరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిలో ప్రోబయోటిక్స్‌తో పాటు ప్రోటీన్, కాల్షియం, పేగు ఆరోగ్యానికి ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా సమృద్ధిగా ఉంటాయి. పెరుగు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. పెరుగును తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వస్తాయని చాలా మంది భావించి దీనిని తీసుకోవడాన్ని నివారిస్తారు. అయితే ఇది సరైన అభిప్రాయం కాదని వైద్యులు చెబుతున్నారు. పెరుగు వల్ల దగ్గు, జలుబు సమస్యలు రావని స్పష్టం చేస్తున్నారు. అయితే చల్లటి పదార్థాలకు సున్నితంగా స్పందించే వ్యక్తులు చల్లగా ఉన్న పెరుగును తీసుకుంటే కొంత అసౌకర్యం కలిగే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆరోగ్యవంతులు రాత్రి భోజనంలో కూడా పెరుగు తీసుకోవచ్చని, అయితే సాధ్యమైనంత వరకు రాత్రి ఏడుగంటలలోపు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. పాలు మంచివా లేక పెరుగు మంచిదా అనే సందేహం కూడా చాలా మందికి ఉంటుంది. జీర్ణక్రియ పరంగా చూస్తే పాల కంటే పెరుగు సులభంగా జీర్ణమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. పెరుగు పేగులోని మంచి బ్యాక్టీరియాను సమతుల్యం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే పెరుగు ఆమ్లత్వాన్ని పెంచుతుందని భావించడం కూడా అపోహనని వైద్యులు చెబుతున్నారు. అయితే చాలా పులిసిన పెరుగు కొంతమందిలో ఆమ్లత్వ లక్షణాలను ప్రేరేపించే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

డయాబెటిస్ ఉన్నవారు పెరుగు తీసుకోకూడదనే అభిప్రాయం కూడా తప్పేనని వైద్యులు చెబుతున్నారు. చక్కెర లేకుండా తీసుకునే పెరుగు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉండటం వల్ల డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో తీసుకోవచ్చు. చేపలు, చికెన్, మటన్ వంటి ప్రోటీన్ ఆహారాలతో పెరుగు తీసుకోవద్దనే అభిప్రాయం కూడా నిజం కాదని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే బయట ప్యాకెట్లలో లభించే పెరుగు కంటే ఇంట్లో తయారు చేసిన తాజా పెరుగు తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు. సాధారణంగా రోజుకు ఒక కప్పు మోతాదులో పెరుగును తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

# భోజనం తర్వాత కడుపు నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు

## - అజీర్ణం నుంచి ఇతర వ్యాధుల వరకు కారణాలు - లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి



మన గళం, ఆరోగ్యం : కొంతమందికి భోజనం చేసిన కొద్దిసేపటికే కడుపు నొప్పి వస్తూ ఉంటుంది. చాలామంది దీనిని గ్యాస్, అతిగా తినడం లేదా సాధారణ సమస్యగా భావించి పట్టించుకోరు. అయితే భోజనం చేసిన తర్వాత వచ్చే కడుపు నొప్పి కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతంగా ఉండవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా కారణాలను గుర్తించి సమయానికి జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. భోజనం తర్వాత కడుపు నొప్పికి అనేక కారణాలు ఉండవచ్చు. అజీర్ణం కారణంగా ఆహారం సరిగా జీర్ణం కాకపోతే పొట్టలో బరువుగా అనిపించడం, నొప్పి కలగడం సాధారణం. అలాగే కడుపులోని ఆమ్లం అన్నవాహికలోకి తిరిగి రావడం వల్ల కలిగే గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి కూడా ఈ సమస్యకు కారణమవుతుంది. కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత పిత్తాశయ రాళ్లు ఉన్నవారిలో పై పొట్ట భాగంలో తీవ్రమైన నొప్పి కనిపించవచ్చు. కడుపు లేదా పేగులో పుండ్లు ఏర్పడే సమస్య కూడా తిన్న తర్వాత నొప్పి రావడానికి కారణమవుతుంది. అలాగే ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యల వల్ల కడుపు నొప్పి, గ్యాస్, మలబద్ధకం లేదా విరేచనాలు కనిపించవచ్చు. కొన్ని ఆహారాలు శరీరానికి సరిపోకపోవడం వల్ల కూడా కడుపు నొప్పి, గ్యాస్, తిమ్మిరి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కడుపు నొప్పితో పాటు గ్యాస్, పొట్ట ఉబ్బరం, గుండెల్లో మంట, వికారం, వాంతులు, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి. భోజనాన్ని నెమ్మదిగా తినడం, ఆహారాన్ని బాగా నమలడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం వంటి అలవాట్లు ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. సమస్య తరచుగా కొనసాగితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# బెల్లం కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



మన గళం, ఆరోగ్యం : మన దైనందిన ఆహారంలో బెల్లం ముఖ్యమైన భాగంగా ఉపయోగించబడుతుంది. అయితే మార్కెట్‌లో లభించే కొన్ని బెల్లాల్లో కల్తీ పదార్థాలు కలపడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బెల్లంలో సోడియం బైకార్బోనేట్ వంటి పదార్థాలు కలపడం జరుగుతుంటుంది. ఈ కల్తీని సులభంగా గుర్తించడానికి చిన్న పరీక్ష చేయవచ్చు. బెల్లంలో సోడియం బైకార్బోనేట్ ఉంటే అది హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో ప్రతిచర్యకు లోనై కార్బన్ డై ఆక్సైడ్ వాయువును విడుదల చేస్తుంది. ఈ వాయువు కారణంగా బుడగలు ఏర్పడతాయి. ఈ బుడగలు కనిపిస్తే బెల్లంలో కల్తీ ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. ఈ సరళమైన పరీక్ష ద్వారా బెల్లం నాణ్యతను తెలుసుకోవడం సాధ్యమవుతుంది. కల్తీ బెల్లాన్ని ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి హాని కలగవచ్చు. కాబట్టి బెల్లం కొనుగోలు చేసే సమయంలో కొన్ని ముఖ్యమైన సూచనలను పాటించడం అవసరం. బెల్లం ప్యాకెట్‌పై ఆహార భద్రతా ప్రమాణ సంస్థ లైసెన్స్ సంఖ్య ఉందో లేదో పరిశీలించాలి. చాలా ప్రకాశవంతంగా, మెరిసే బెల్లాన్ని కొనకుండా ఉండటం మంచిది. అలాగే నమ్మకమైన విక్రేతల ద్వారా మాత్రమే బెల్లాన్ని కొనుగోలు చేయడం మంచిది. కొద్దిగా గోధుమరంగు లేదా గాఢ రంగులో ఉండే బెల్లం సాధారణంగా మంచి నాణ్యత కలిగి ఉంటుంది. తక్కువ ధరకు లభిస్తుంది కాబట్టి వెంటనే కొనుగోలు చేయకుండా జాగ్రత్తగా పరిశీలించి కొనాలి. బెల్లంలో కల్తీ ఉందని అనుమానం వస్తే ఆహార భద్రతా సంస్థ ఫిర్యాదు వేదిక, మొబైల్ అనువర్తనం లేదా స్థానిక ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే బెల్లం కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

# రాత్రి భోజనం త్వరగా చేస్తే ఆరోగ్యానికి మేలు

## - సరైన సమయానికి భోజనం అవసరం - చక్కెర స్థాయిల నియంత్రణలో కీలకం - బరువు నియంత్రణకు సహాయకారి



మన గళం, ఆరోగ్యం : రాత్రి పూట తీసుకునే ఆహారం శరీరానికి అత్యంత పోషకాలను అందించేదిగా ఉండాలి. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలోనే కాకుండా శరీర మరమ్మత్తు ప్రక్రియను మెరుగుపరచడంలో, జీవక్రియను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే మరుసటి రోజుకు శక్తిని అందించడంలో, యాసిడ్ సమస్యలను తగ్గించడంలో, నిద్రకు సహాయపడడంలో రాత్రి భోజనం ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది రాత్రి తేలికపాటి ఆహారం తీసుకోవడంపై శ్రద్ధ చూపుతారు. అయితే ఆహారం మాత్రమే కాదు దాన్ని తీసుకునే సమయం కూడా చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి భోజనాన్ని సాధ్యమైనంత వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్యలో తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే నిద్రకు వెళ్లే ముందు కనీసం రెండు నుంచి మూడు గంటల ముందే భోజనం చేయడం శరీర సహజ గడియారానికి అనుకూలంగా ఉంటుంది. రాత్రి భోజనం త్వరగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండటానికి సహాయపడుతుంది. జీవక్రియ మెరుగుపడడంతో పాటు నిద్ర నాణ్యత కూడా పెరుగుతుంది. ఆలస్యంగా భోజనం చేయడం వల్ల ఇన్సులిన్ స్పందన తగ్గి శరీరం కార్బోహైడ్రేట్లను సమర్థవంతంగా ప్రాసెస్ చేయలేకపోతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. త్వరగా భోజనం చేయడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు సాధారణ స్థితికి చేరడంతో పాటు ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం వల్ల క్యాలరీలు శక్తిగా మారకుండా కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో పొట్ట చుట్టూ కొవ్వు పెరిగే ప్రమాదం ఉంటుంది. అదే రాత్రి భోజనం త్వరగా తీసుకోవడం వల్ల కొవ్వు కరుగుదల మెరుగుపడి బరువు నియంత్రణలో ఉంటుంది. జీర్ణక్రియ సక్రమంగా జరిగి నిద్ర కూడా సులభంగా పడుతుంది. ఈ అలవాటు వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని వైద్యులు సూచిస్తున్నారు.



# బుమ్రాకు దక్కని గుర్తింపు? నెట్టింట ఆసక్తికర చర్చ



హైదరాబాద్ 6 మార్చి ,మనగలం :భారత క్రికెట్ జట్టులో కీలక బౌలర్‌గా నిలిచిన జస్ప్రీత్ బుమ్రా ప్రతిభకు తగిన స్థాయిలో గుర్తింపు దక్కడం లేదనే అంశంపై ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ మ్యాచ్‌లో బ్యాటర్లకు అనుకూలమైన పిచ్‌పై పరుగుల వరద పారినప్పటికీ బుమ్రా తన అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్‌ను భారత జట్టు వైపు మలిచాడని అభిమానులు పేర్కొంటున్నారు. మొత్తం మ్యాచ్‌లో దాదాపు అయిదువందల పరుగులు నమోదైన నేపథ్యంలో కూడా బుమ్రా కేవలం నాలుగు ఓవర్లలో ముప్పై మూడు పరుగులు మాత్రమే ఇచ్చి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడం విశేషమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరిత దశలో ఉన్నప్పుడు వేసిన పదెనిమిదో ఓవర్ మ్యాచ్ గమనాన్నే మార్చేసిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఆ ఓవర్‌లో అతడు అద్భుతమైన యార్కర్లు, ఖచ్చితమైన లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఒత్తిడికి గురి చేశాడు. గతంలో కూడా ఓటమి అంచున ఉన్న అనేక మ్యాచ్‌లలో బుమ్రా తన మాయా బౌలింగ్‌తో భారత జట్టును గట్టెక్కించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అభిమానులు గుర్తు చేస్తున్నారు. క్లిష్ట సమయంలో వికెట్లు తీస్తూ జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నప్పటికీ అతనికి తగినంత ప్రశంసలు లభించడం లేదని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత క్రికెట్‌లో సాధారణంగా బ్యాటర్లకే ఎక్కువ ప్రాచుర్యం లభిస్తుందని, బౌలర్లకు అదే స్థాయి గుర్తింపు దక్కడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రముఖ బ్యాటర్లతో పోలిస్తే బుమ్రాకు లభిస్తున్న ప్రకటనలు, వాణిజ్య ఒప్పందాలు మరియు సామాజిక మాధ్యమాల్లో అనుచరుల సంఖ్య తక్కువగా ఉండటం ఈ చర్చకు కారణమైంది. మ్యాచ్ గెలిపించే సామర్థ్యం ఉన్న ఆటగాడైనా గ్లామర్ మరియు మార్కెట్ విలువ పరంగా బౌలర్లకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుమ్రా వంటి ప్రతిభావంతులైన బౌలర్లకు కూడా సమాన స్థాయిలో గుర్తింపు ఇవ్వాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా కోరుతున్నారు.

# న్యూజిలాండ్‌తో పోరు అంత సులభం కాదు



హైదరాబాద్ 6 మార్చి ,మనగలం :ఇరవై ఓవర్ల ప్రపంచకప్ తుది పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం జరగనున్న ఈ కీలక పోటీలో భారత్, న్యూజిలాండ్ జట్లు కప్పు కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. అయితే ప్రపంచకప్ చరిత్రలో ఇరు జట్ల మధ్య జరిగిన పోటీల గణాంకాలను పరిశీలిస్తే న్యూజిలాండ్ జట్టుకు కొంత ఆధిపత్యం ఉన్నట్టు కనిపిస్తోంది. గతంలో మెగా టోర్నీల్లో ఎదురుపడిన సందర్భాల్లో న్యూజిలాండ్ జట్టు విజయం సాధించడం భారత అభిమానుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. అయినప్పటికీ ప్రస్తుత భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో ఈసారి పరిస్థితి భిన్నంగా ఉండొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్ విభాగం చాలా బలంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి తోడు రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు జట్టులో ఉండటంతో కివీస్ బ్యాటింగ్ శక్తి మరింత పెరిగింది. వీరిలో ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం కలిగినవారే. అందువల్ల వీరిని నియంత్రించడం భారత బౌలర్లకు పెద్ద సవాలుగా మారనుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత బౌలింగ్ దళం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలోని పేస్ దళం ప్రారంభ ఓవర్లలోనే వికెట్లు సాధిస్తే మ్యాచ్ భారత్ వైపు తిరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పవర్‌ప్లేలో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడం భారత విజయానికి కీలకంగా మారనుంది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కూడా నియంత్రణతో బౌలింగ్ చేస్తే న్యూజిలాండ్ పరుగుల వేగాన్ని తగ్గించగలరు. గత గణాంకాలు ఏం చెబుతున్నాయన్నది పక్కన పెట్టి ఫైనల్ పోరులో కొత్త చరిత్ర రాయాలనే సంకల్పంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. వ్యూహాత్మక ప్రణాళికలు, సమిష్టి ప్రదర్శనతో ఆడితే న్యూజిలాండ్ సవాల్‌ను భారత్ అధిగమించగలదని అభిమానులు ఆశిస్తున్నారు. సొంత గడ్డపై జరిగే ఈ తుది పోరులో విజయం సాధించి ప్రపంచకప్ కప్పును మరోసారి ఎత్తాలని భారత జట్టు దృఢ సంకల్పంతో సిద్ధమవుతోంది.

# ఇంగ్లాండ్ ఆటతీరు చూసి ఆశ్చర్యపోయా: సూర్యకుమార్ యాదవ్




హైదరాబాద్ 6 మార్చి ,మనగలం :ఇరవై ఓవర్ల ప్రపంచకప్ సెమీఫైనల్ పోటీలో ఇంగ్లాండ్‌పై భారత్ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లిన నేపథ్యంలో భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించారు. ఈ మ్యాచ్ ఎంతో ఉత్కంఠగా సాగిందని, ఇంగ్లాండ్ జట్టు ప్రదర్శన చూసి తాను నిజంగానే ఆశ్చర్యపోయానని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో జట్టుకు నాయకత్వం వహిస్తూ ఫైనల్‌కు చేరుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉందని చెప్పారు. దేశం ముందే ఆడుతూ జట్టును విజయపథంలో నడిపించడం గర్వకారణమని, ఈ విజయం మొత్తం జట్టు సమిష్టి కృషి ఫలితమని ఆయన వెల్లడించారు. భారత్ ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడని సూర్యకుమార్ యాదవ్ ప్రశంసించారు. వికెట్ పడినా కూడా పరిస్థితిని అర్థం చేసుకొని దూకుడుగా బ్యాటింగ్ చేశాడని తెలిపారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని గ్రహించి అతడు ఆడిన ఇన్నింగ్స్ జట్టుకు ఎంతో ఉపయోగపడిందన్నారు. అదే సమయంలో ఇంగ్లాండ్ జట్టు కూడా అద్భుతంగా పోరాడిందని పేర్కొన్నారు. ప్రత్యర్థి జట్టు బ్యాటింగ్ తీరు చూసి ఒక దశలో 'మీపై గెలవాలంటే ఇంకా ఎన్ని పరుగులు చేయాలి?' అని వారి ఆటగాడిని సరదాగా అడిగానని ఆయన అన్నారు. ఇంగ్లాండ్ లక్ష్య ఛేదనలో చివరి వరకు మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిందని, ఆ సమయంలో తనకు కూడా తీవ్ర ఒత్తిడి అనిపించిందని సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎవరైనా ఆ సమయంలో తన గుండె స్పందనను కొలిచివుంటే అది చాలా ఎక్కువగా ఉండేదని సరదాగా వ్యాఖ్యానించారు. అయినప్పటికీ బౌలర్లు అద్భుతంగా రాణించి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారని చెప్పారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ కీలక సమయాల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి పరుగుల ప్రవాహాన్ని అడ్డుకున్నారని ఆయన కొనియాడారు. బుమ్రా ఎన్నేళ్లుగా భారత జట్టుకు ఎంత గొప్ప సేవ చేస్తున్నాడో అందరికీ తెలిసిందేనని, ఈ మ్యాచ్‌లో కూడా అతడు అదే స్థాయి ప్రదర్శన చూపాడని తెలిపారు. మ్యాచ్‌కు ముందు నుంచే స్టేడియం అభిమానులతో నిండిపోయిందని, భారత్ గెలవాలని ప్రేక్షకులు ఎంతగా కోరుకుంటున్నారో అప్పుడు స్పష్టంగా కనిపించిందని సూర్యకుమార్ యాదవ్ అన్నారు. దేశంలో ఫైనల్ ఆడటం ఒకవైపు ఆనందం కలిగిస్తూనే మరోవైపు ఒత్తిడిని కూడా పెంచుతుందని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆటగాళ్లు, సహాయక సిబ్బంది అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, అభిమానులకు మరొక గొప్ప పోరును అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఇదే పోరాటస్ఫూర్తితో ఆడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# గచ్చిబౌలిలో మహిళల క్రికెట్ లీగ్ లోగో ఆవిష్కరణ




హైదరాబాద్ 6 మార్చి ,మనగలం : మహిళలు క్రీడారంగంలో మరింతగా ముందుకు రావాలని లక్ష్యంగా ఏర్పాటు చేసిన మహిళల క్రికెట్ లీగ్ ప్రయాణం అధికారికంగా ప్రారంభమైంది. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ లీగ్ అధికారిక గుర్తును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మహిళా క్రీడాకారిణుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వారికి కొత్త అవకాశాల ద్వారాలు తెరవబోతుందని నిర్వాహకులు తెలిపారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సినీ మరియు క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ నిర్మాతలు టి.జి. విశ్వ ప్రసాద్, కె.ఎల్. దామోదర్ ప్రసాద్‌తో పాటు లీగ్ దర్శకురాలు మరియు నటి స్నిగ్ధ కూడా పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖులు, క్రీడా రంగానికి చెందిన అతిథులు ఈ వేడుకలో పాల్గొని మహిళల క్రీడాభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ వేదిక మహిళలకు తమ ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశంగా మారుతుందని వారు పేర్కొన్నారు.కుటుంబ బాధ్యతలు, ఉద్యోగాలు మరియు వ్యక్తిగత లక్ష్యాలను సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్న మహిళలకు క్రీడలు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని నిర్వాహకులు తెలిపారు. మహిళల సంకల్పం, శక్తి, ఐక్యతను గుర్తించి ప్రోత్సహించడమే ఈ లీగ్ ముఖ్య ఉద్దేశమని వారు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరిగి మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ లోగో ఆవిష్కరణతో మహిళల క్రికెట్ లీగ్ అధికారికంగా ప్రారంభమైనట్టైంది. ఈ లీగ్ పోటీలు మార్చి ఏడవ తేదీ మరియు మార్చి ఎనిమిదవ తేదీల్లో సాయంత్రం ఆరు గంటలకు తెల్లాపూర్ ప్రాంతంలోని ప్రైమ్ అరినా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో సినీ రంగం, వ్యాపార రంగం, గృహిణులు మరియు వివిధ వృత్తులకు చెందిన మహిళలు పాల్గొననున్నారు. మొత్తం ఆరు జట్లకు చెందిన తొంభై ఆరు మంది మహిళలు ఈ పోటీల్లో ఆడబోతుండటంతో మహిళా క్రీడాకారిణులకు ఇది ఒక ముఖ్య వేదికగా నిలవనుంది.

# టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు అంపైర్లు ఖరారు



హైదరాబాద్ 6 మార్చి ,మనగలం :ఇరవై ఓవర్ల ప్రపంచకప్ రెండువేల ఇరవై ఆరు టోర్నమెంట్ తుది దశకు చేరుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా ఆదివారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక ఫైనల్ పోటికి అంతర్జాతీయ క్రికెట్ మండలి అంపైర్లను ఖరారు చేసింది. ఈ కీలక పోటీలో ఇంగ్లాండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ మైదాన అంపైర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రపంచ క్రికెట్ అభిమానుల దృష్టి అంతా ఈ తుది పోటీపై కేంద్రీకృతమవడంతో పాటు అంపైర్ల నియామకంపై కూడా ఆసక్తి నెలకొంది. రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్‌కు ఇది వరుసగా రెండోసారి ఇరవై ఓవర్ల ప్రపంచకప్ ఫైనల్‌లో అంపైర్‌గా వ్యవహరించే అవకాశం కావడం ప్రత్యేకంగా నిలిచింది. రెండువేల ఇరవై నాలుగు సంవత్సరంలో బార్బడోస్ వేదికగా జరిగిన ఫైనల్ పోటీలో కూడా ఆయన అంపైర్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా రెండువేల ఇరవై మూడు వన్డే ప్రపంచకప్ ఫైనల్, రెండువేల ఇరవై ఐదు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ పోటీల్లో కూడా ఆయన అంపైర్‌గా సేవలందించడం గమనార్హం. అనుభవజ్ఞుడైన అంపైర్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ వేగవంతమైన బౌలర్ అలెక్స్ వార్ఫ్‌కు సీనియర్ స్థాయి ప్రపంచకప్ ఫైనల్ పోటీలో అంపైరింగ్ చేయడం ఇదే మొదటిసారి. టోర్నమెంట్ మొత్తం ఆయన మంచి నిర్ణయాలతో ప్రశంసలు అందుకున్నారు. ఈ ఫైనల్ పోటికి మ్యాచ్ రిఫరీగా జింబాబ్వేకు చెందిన ఆండీ పైక్రాఫ్ట్ వ్యవహరించనున్నారు. మూడో అంపైర్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన అల్లావుద్దీన్ పాలేకర్ బాధ్యతలు నిర్వహించనుండగా నాలుగో అంపైర్‌గా అడ్రియన్ హోల్డ్‌స్టాక్ ఉంటారు. పాలేకర్ ఇప్పటికే ఈ టోర్నమెంట్‌లో అనేక మ్యాచ్‌లకు అంపైరింగ్ చేసి మంచి అనుభవాన్ని సంపాదించారు. కీలకమైన ఈ తుది పోటీలో మ్యాచ్ నిర్వహణ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ బృందాన్ని నియమించింది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.